క్లుప్తంగా

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న సీఆర్ఎంటీ లక్ష్మీనారాయణ

మునగపాక: మధ్యాహ్న భోజన పథకం నాణ్యతగా ఉండాలని సీఆర్ఎంటీ లక్ష్మీనారాయణ కోరారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎంఈవో వేణుగోపాలరావు ఆదేశాల మేరకు పరిశీలన చేసి నిర్వాహకులకు సూచనలు చేసినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. పథకం తయారీలో లోపం లేకుండా చూడాలని, మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోటాడ శ్మశానవాటికకు పరదా ఏర్పాటు



తోటాడ శ్మశానవాటికకు ఏర్పాటు చేసిన పరదా

మునగపాక: మండలంలోని తోటాడ శ్మశానవాటికకు పరదా ఏర్పాటు చేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్మశానవాటిక అభివృద్ధిలో భాగంగా ఒకవైపు పరదా ఏర్పాటు చేశారు. శ్మశానవాటికలో అంత్యక్రియలు చేసేందుకు వెళ్లే వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరదా ఏర్పాటు చేసినట్లు కోటేశ్వరరావు తెలిపారు. డంపింగ్ యార్డుకు, శ్మశానవాటికకు మధ్య ఈ పరదా ఏర్పాటు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక: మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ గోపీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మునగపాక, అరబుపాలెం, తిమ్మరాజుపేట, పాటిపల్లి, వాడ్రాపల్లి, నాగవరం, రాజుపేట, గొల్లలపాలెం, ఒంపోలు, నాగులాపల్లి, ఉమ్మలాడ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొత్తపేట ఆలయ పునర్నిర్మాణంపై ఫిర్యాదు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేట రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకుండా భక్తుల నుంచి భారీగా విరాళాల సేకరణ, సామాన్య భక్తులకు ఎదురౌతున్న ఇబ్బందులు, తదితర విషయాలపై పట్టణానికి చెందిన భక్తుడు పిల్లా నూకేశ్వరరావు శుక్రవారం యలమంచిలి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశారు. పూర్వీకుల కృషితో నిర్మించిన ఈ ఆలయ పునర్నిర్మాణ పనులు, శిలా విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమాలన్నీ దేవదాయ శాఖ అధికారులు లేకుండానే జరగడంతో పాటు గత కొన్నేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు ప్రైవేటు వ్యక్తులు సొంతంగా రశీదు పుస్తకాలు ముద్రించి ఆలయానికొచ్చే భక్తుల నుంచి పెద్ద మొత్తంలో విరాళాలు వసూలు చేయడం, తదితర విషయాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై యలమంచిలి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవిని సంప్రదించగా.. తాను 20 రోజుల క్రితమే ఇక్కడ విధుల్లో చేరానని, శివాలయం పునర్నిర్మాణానికి సంబంధించిన వ్యవహారాలేవీ తనకు తెలీదన్నారు. విచారణ చేపడతామన్నారు.

గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



అమ్మవారి ఊంజల్ సేవ చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయత దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 201వ ఊంజల్ సేవ కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పాందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని మళ్ల అప్పారావు, రవిరాజు, అరుణ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి కరణం జగదీష్, గౌరీశ మహిళా మండలి ప్రతినిధి పెతకంశెట్టి సుజాత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కష్టాల.. కస్తూర్బా



తిమ్మాపురం కేజీబీవీకి ప్రహరీ లేక కరువైన రక్షణ

పాఠశాలను ఆనుకుని చెత్త పడేస్తున్న గ్రామస్తులు

సమస్యను మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం

ప్రహరీ లేని తిమ్మాపురం కేజీబీవీ



తిమ్మాపురం కేజీబీవీలో ఆరుబయట ఆటలు ఆడుతున్న విద్యార్థినులు



పాఠశాలను ఆనుకుని నిర్మించిన సీసీ రోడ్డు, సమీపంలో విద్యార్థినులు ఆరబెట్టుకున్న వస్త్రాలు

ఎస్.రాయవరం: తిమ్మాపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కష్టాల సుడి గుండంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ పాఠశాలకు శాశ్వత భవనం కోసం అప్పటి గ్రామ పెద్దలు సర్వే నంబర్ 126పీలో 1.55 ఎకరాల స్థలం కేటాయించారు. 2012లో భవన నిర్మాణం పూర్తి చేశారు. అయితే భవనం చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది. ఇందు కోసం గత ప్రభుత్వ హయాంలో ఎస్ఎస్ఏ అధికారులు నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా జనవరిలో భవనం చుట్టూ 340 మీటర్ల ప్రహరీ నిర్మాణం చేసేందుకు రూ.29.58 లక్షలు కేటాయించారు. పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమయ్యే సరికి గ్రామపెద్దలు ఆటంకాలు కల్పిస్తున్నారని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల హోం మంత్రి వంగలపూడి అనిత ఈ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్న ఆమెను ప్రధాన సమస్య అయిన ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. పరిశీలించి పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చి వెళ్లారు. అయినా పనులు ప్రారంభించలేదు.

బోర్డు ఆమోదం లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం

ఇటీవల ఈ పాఠశాల మైదానానికి ఆనుకుని పంచాయతీ బోర్డు ఆమోదం లేకుండా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయించి కూటమి నేతలు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు భవనం మరింత బహిరంగంగా కనిపిస్తోంది. విద్యార్థులు ఏ చిన్న అవసరానికి బయటకు వచ్చినా నాలుగు వైపులా రోడ్లు, ఆరుబయట ప్రాంగణం ఎక్కువ కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పాఠశాలలో గతేడాది నుంచి ఇంటర్మీడియెట్ బోధన కూడా ప్రారంభించారు. దీంతో భవనం మరింత ఇరుకుగా మారింది. ఇంటర్ తరగతి గదుల నిర్మాణాలకు కేటాయించిన ఖాళీ స్థలంలో కాకుండా కేజీబీవీ భవనంపై నిర్మాణం చేపట్టారు. దీంతో విద్యార్థులు వసతి సమయంలో ఉతుక్కున్న దుస్తులను ఆరుబయట స్టాండ్‌లు ఏర్పాటు చేసుకుని ఆరబెట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది.

ఆగని ఆకతాయిల ఆగడాలు

ప్రహరీ లేక ఆరుబయట ఆకతాయిలు చేష్టలకు విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థినులతో పాటు బోధిస్తున్న మహిళా ఉపాధ్యాయినులు కూడా ఆకతాయిలతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసి పుష్కరిణి కాలం గడుస్తున్నా ప్రహరీ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ప్రహరీ లేక పాఠశాలకు ఆనుకుని చెత్త వేస్తున్న గ్రామస్తులు



చాలీచాలని ప్రదేశంలో స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థినులు

కలెక్టర్ దృష్టికి సమస్య

తిమ్మాపురం కేజీబీవీలో ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నేను ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టాను. ప్రహరీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను. బాలికలు ఉండే వసతి గృహానికి విధిగా ప్రహరీ తప్పనిసరి. తాత్కాలికంగా సీసీ కెమెరాల నిఘాలో భవనం ఉంది. నిత్యం సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థులు ఉండేలా చేస్తున్నాం.

– జయప్రకాష్, అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, అనకాపల్లి జిల్లా

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం



తడి, పొడి చెత్త సేకరణ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఈవోపీఆర్డీ సోమరాజు అన్నారు. మండలంలోని టి.సిరసపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణకు సంబంధించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు పంచాయతీల పారిశుధ్య కార్మికులు ఉదయం నుంచి గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణ ద్వారా ఎరువులను తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

మోదకొండమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న గాంధీ

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న మోదకొండమ్మ తల్లి ఆలయానికి భక్తులు తమ వంతు సాయం అందజేస్తున్నారు. మూలపేటకు చెందిన కాండ్రేగుల గాంధీ ఆలయ నిర్మాణానికి రూ.5వేల విరాళాన్ని గురువారం రాత్రి కమిటీ సభ్యులకు అందజేశారు.

భూఆధార్ నమోదులో సర్వర్ కష్టాలు



కొరుప్రోలు రైతు భరోసా కేంద్రంలో భూఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం: గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో తలపెట్టిన భూఆధార్ నమోదు ప్రక్రియకు సర్వర్ మొరాయింపుతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఈ నెల 25వ తేదీతో గడువు ముగియనుందని సిబ్బంది ప్రచారం చేయడంతో రైతులు పదే పదే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బంది అందుబాటులో ఉంటూ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నప్పటికీ సర్వర్ మొరాయింపుతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. సర్వర్ సక్రమంగా పని చేసే వరకు గడువు పెంచాలని రైతులు కోరుతున్నారు. భూఆధార్ నమోదు కాకుంటే ప్రభుత్వం ఇచ్చే రాయితీలు రావన్న ఆందోళనలో రైతులు ఉన్నారు.

చురుగ్గా సీసీ రోడ్ల పనులు



మాడ వీధుల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

నక్కపల్లి: మండలంలో ఉపమాక పుణ్యక్షేత్రంలో స్వామివారి తిరువీధి సేవలు నిర్వహించే మాడ వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్లు శిథిలావస్థకు చేరడంతో తిరువీధి సేవలు నిర్వహించే సమయంలో ఇబ్బంది ఎదురవుతోందని స్థానికులు హెటిరో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో కంపెనీ చైర్మన్ పార్థసారథిరెడ్డి సుమారు రూ. 25 లక్షలు మంజూరు చేశారు. రెండు మాడవీధుల్లో సీసీ రోడ్లు నిర్మించడానికి అంగీకరించారు. కొద్ది రోజుల నుంచి ఈ పనులు జరుగుతున్నాయి. ఆక్రమణలు తొలగించి విశాలమైన సీసీ రోడ్లను నిర్మిస్తున్నారని, తిరువీధి సేవలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. వచ్చే నెల 10న ప్రారంభమయ్యే స్వామివారి కల్యాణోత్సవాల నాటికి సీసీ రోడ్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్లకు మద్దతుగా ప్రచారం



రాంబిల్లిలో ఎన్నికలు ప్రచారం నిర్వహిస్తున్న యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో పెదకలవలాపల్లి, లాలంకోడూరు, కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో యూటీఎఫ్, పీడీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మద్దతుగా సీఐటీయూ నాయకులతో కలిసి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు ఎల్లయ్యబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, జిల్లా నాయకులు సీహెచ్.శివాజీ, సీహెచ్.పద్మనాభరావు, మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకుడు డి.కాశి, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ నారాయణను విధుల్లోకి తీసుకోవాలి



రెండో రోజు డిపో గేటు వద్ద నిరసన తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు

అనకాపల్లి: ఆర్టీసీ ఉద్యోగులపై ఆ శాఖ అధికారులు వేధింపులు ఆపాలని, అనకాపల్లి డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ ఎస్.ఎస్.నారాయణను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం కూడా మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో అధ్యక్షుడు కె.ఎం.రావు మాట్లాడుతూ ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లపై ఉన్నత స్థాయి అధికారులు వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీ వేస్తున్నారని ఆరోపించారు. సస్పెండ్ చేసిన కండక్టర్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రీజనల్ అధ్యక్షుడు ఆర్.ఎస్.రాజు, డిపో ప్రచార కార్యదర్శి ఎస్.వి.ఎస్.నారాయణ, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బాగులతో విద్యార్థులు

ఎస్.రాయవరం: దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో మంచి ఫలితాలు సాధించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉద్దండం సూర్యానారాయణ అన్నారు. విజన్ వలంటరీ ఆర్గనైజేషన్ సహాయంతో పలు పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. పెనుగొల్లు, ధర్మవరం అగ్రహారం గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుతున్న సుమారు 150 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఈ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విమలాదేవి, గారా ప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మురుగు నివారణకు చర్యలు



డ్రైనేజీ పనులు చేపడుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

అచ్యుతాపురం: మండలంలో ఎం.జగన్నాథపురంలో డ్రైనేజీ పనులు చేపట్టారు. ఇటీవల సాక్షిలో 'మురుగు ఆపేదెవరు..?'అనే శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎగువ నుంచి వస్తున్న మురుగునీరు సరైన అనుసంధానం లేకపోవడంతో ఏళ్ల తరబడి రోడ్డుపైనే నిలిచిపోవడం, వాహన దారులకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో వెలుగులోకి తీసుకొచ్చిన సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ పాలకుల సహకారంతో సమస్య పరిష్కానికి నడుంబిగించారు. పంచాయతీ నిధులతో చేపడుతున్న ఈ పనులు పూర్తయితే మురుగునీటి సమస్య నుంచి ఉపశమనం కలగనుంది.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కె.వెంకటాపురంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటవురట్ల: తెలుగు భాష గొప్పతనం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్ అన్నారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగు భాషకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మాతృ భాష తెలుగుపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. అనంతరం తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ పద్యాలు, పాటలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, క్రాంతికిరణ్, అరుణ, అప్పారావు, జె.వి.ప్రసాద్, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



వేడుకలో మహిళా కళాకారుల సందడి



శివ పార్వతుల వేషధారణలో కళాకారులు

కోటవురట్ల: జల్లూరులో శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసి విద్యుద్దీపాలంకరణ కనువిందు చేయగా, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బంధు మిత్రుల రాకతో లోగిళ్లు కళకళలాడాయి. తిరునాళ్లలో అన్ని వయసుల వారు సందడి చేశారు. కోలాటం, డ్యాన్స్ కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ఆందోళన



అనకాపల్లి యూనియన్ బ్యాంకు ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బ్యాంకులో నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వారానికి ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ నియామకాలు ఆపాలన్నారు. యూనియన్ బ్యాంకు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ మాట్లాడుతూ వచ్చే నెల 24, 25 తేదీల్లో జరిగే బ్యాంకు ఉద్యోగుల రెండు రోజుల దేశ వ్యాప్త ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రమేష్, సిబ్బంది శ్రీదేవి, శిరీష, రోజా, ఎ.వి.జె.రాజు, ఆదారి రాము, మాలతి, తదితరులు పాల్గొన్నారు.

విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి



అగ్రికల్చర్ ఏడీఏ శ్రీదేవి

నర్సీపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవసాయ శాఖ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీఏ శ్రీదేవి పేర్కొన్నారు. రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. భూమి గల ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను 11 అంకెలను ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ సంఖ్య ద్వారా వ్యవసాయ సేవలను సులభతరంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ పథకం ఉద్దేశం భవిష్యత్తులో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీకి రైతులు మొబైల్ నంబర్ అనుసంధానించబడిన ఆధార్, పట్టాదారుని పాస్‌బుక్‌తో గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 73,449 మంది రైతులకు గాను 23,919 మంది రైతులు ఇప్పటి వరకు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని సూచించారు.